క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



తాడూరు: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగా మాస్టర్ రవికుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆస్పత్రి ఆవరణంలో నిర్వహిస్తున్న యోగా శిబిరంలో పాల్గొని మాట్లాడారు. కాలానికి అనుగుణంగా ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపొచ్చన్నారు. వయస్సు పెరిగేకొద్దీ అలవాట్లలో మార్పు చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్, తిరుపతయ్య, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

చెంచుల సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఉన్న చెంచుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా నాయకుడు మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అమరగిరిలో ఆయన చెంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేక చెంచులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెంచు గూడెలలో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు. చెంచు పెంట, గూడెలలో విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించి హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చెంచులు పాల్గొన్నారు.

సమస్యల సాధనకు పోరాడుతాం

కొల్లాపూర్ రూరల్: దివ్యాంగుల సమస్యల సాధనకు పోరాడుతామని దండోరా జిల్లా నాయకుడు ఎదుల రాముడు అన్నారు. ఆదివారం మండలంలోని కుడికిల్లలో దండోరా నాయకులు, దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలన్నారు. లేని పక్షంలో 9న హైదరాబాద్‌లో వృద్ధులు, దివ్యాంగులతో కలిసి బహిరంగ సభ ఏర్పాటు చేయనునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దండోరా, మరియు పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



తెలకపల్లి: మండలంలోని గౌరారంలో ఇటీవల మృతి చెందిన చింతకుంట్ల ఉషమ్మ, చింతకుంట్ల కాశమ్మలు మృతిచెందారు. గ్రామ బీఆర్ఎస్ నాయకులు బాధితకుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ. 10వేల ఆర్థికసా యం అందజేశారు. కార్యక్రమంలో కువలేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జమ్ములు రాంరెడ్డి మహముద్, రాజేందర్‌గౌడ్, బాలకృష్ణయ్య, జంగయ్య, మల్లయ్య, భరత్ నాగరాజుపాల్గొన్నారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలో వృద్ధురాలు కొత్తూరు లక్ష్మమ్మ మృతిచెందడంతో అంత్యక్రియల కోసం ఆదివారం రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ బాలస్వామి, గ్రామస్తులు దాసరాజు సాయి, ప్రశాంత్, శివ, సైదులు, బెక్కరి శివ తదితరులు ఉన్నారు.

టీజేఏసీ చైర్మన్‌గా కాశన్నయాదవ్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో ఆదివారం తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. అనంతరం టీజేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కాశన్నయాదవ్, కో చైర్మన్‌గా నాసరయ్య, సభ్యులుగా బాలాజీ, గోపాల్, శ్రీనునాయక్, మహబూబ్‌అలీ, శ్రీశైలం, నారాయణ, చంద్రశేఖర్, శ్రీరాములు, శ్రీనివాసాచారి, బాలకృష్ణయ్య, సుశీలలు ఎన్నికయ్యారు.

నేడు ఎన్నికల నిర్వహణపై సమావేశం

వీపనగండ్ల: రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గం॥లకు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 8 ఎంపీటీసీ స్థానాలకు ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్ల వివరాలు, ఇంతకు పూర్వం ప్రకటించిన ఓటరు జాబితా తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. కావున మండలంలోని వివిధ పార్టీల రాజకీయ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నిలిచిన జీసీసీ ఉత్పత్తులు



మన్ననూర్‌లోని జీసీసీ ప్రధాన కార్యాలయం

- రాష్ట్ర విభజన తర్వాత తగ్గిన సరఫరా
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పర్యాటకులు

మన్ననూర్: సహజ సిద్ధమైన అటవీ ఫలాలు, వన మూలికలతో తయారు చేసే గిరిజన కో–ఆపరేటీవ్ సంస్థ (జీసీసీ) ఉత్పత్తులకు ప్రజల నుంచి ఎంతో ఆదరణ ఉంది. సహజ సిద్ధంగా ఔషధ గుణాలు కలిగిన రక రకాల స్నానం సబ్బులు, ఫిల్టర్ తేనే, సీకాకాయి పౌడర్, ఉసిరి పౌడర్, యాపనూనె, నన్నారి, షాంపులు తదితర వస్తువులను వినియోగించేందుకు స్థానికులతో పాటు పర్యాటకులు ఇష్టపడేవారు. కాని రోజురోజుకు జీసీసీ ఉత్పత్తుల సరఫరా తగ్గిపోవడంతో పర్యాటకులు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహజ సిద్ధమైన ఉత్పత్తులను గతంలో జీసీసీ కేంద్రాల ద్వారా విరివిగా సరఫరా చేస్తూ విక్రయించేవారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల విభజన తర్వాత జీసీసీ ద్వారా ఉత్పత్తి చేస్తున్న వస్తువులను అరకొరగా సరఫరా చేశారు. ప్రస్తుతం తెలంగాణ ప్రాంత జీసీసీ డీఆర్ డిపోలకు సక్రమంగా సరఫరా కావడం లేదు. దీంతో జీసీసీ ఉత్పత్తుల కోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులో కొందరు ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. రీతూ సబ్బు, షాంపులు, నన్నారి, (చలువ నీరు) ఆరోగ్యానికి అన్ని విధాలుగా మంచిదనే ఉద్దేశ్యంతో చాలా మంది వీటిని ఉపయోగించేవారు. ప్రస్తుతం కొంత కాలంగా తెలంగాణ ప్రాంతంలోని జీసీసీ డిపోలలో వీటి సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులకు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆంధ్ర ప్రాంతాలైన విశాఖపట్నం, రాజమండ్రి, చిత్తూరుకు మాత్రమే పరిమితమై ఉండేవి. ఆంధ్ర, తెలంగాణ విభజన అనంతరం ఉత్పత్తులు తెలంగాణలో కూడా ఉత్పత్తి చేస్తున్నప్పటికి జీసీసీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, దోలాయమానంలో అంతంత మాత్రంగానే ఉన్న సిబ్బంది కొరత ఇందుకు కారణం అయిఉంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటూ ముఖ్యంగా శ్రీశైలం పుణ్యక్షేత్రంను సందర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న వారు వీటి కోసం పరితపించడంతో పాటూ అక్కడక్కడ బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే తేనె మాత్రం తీసుకుంటున్నారు. ఇప్పటికైనా సహజ సిద్ధమైన జీసీసీ ఉత్పత్తులకు అలవాటు పడిన వారి కోసం అందుబాటులో ఉంచాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అసంతృప్తికి గురవుతున్నారు



శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఉన్న జీసీసీ ప్రధాన కార్యాలయం అందుబాటులో ఉండటంతో వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన యాత్రికులు సైతం తేనే, సబ్బులు అధిక మొత్తంలో కొనుగోలు చేసేవారు. దీంతో వినియోగదారుల అవసరాలు తీరడంతో పాటూ సంస్థకు ఆదాయం కూడా సమకూరేది. ప్రస్తుతం వీటి సరఫరా నిలిచి పోవడంతో కొనుగోలుదారులు కార్యాలయంలో విచారించుకుని అసంతృప్తితో తిరిగి వెళ్తున్నారు.

–సంబు వెంకటరమణ, జీసీసీ విశ్రాంత ఉద్యోగి మన్ననూర్

అందుబాటులో ఉంచాలి



తెలంగాణ జీసీసీ సంస్థ సమక్షంలో పాలమూరులో షాంపులు, మన్ననూర్, కొండనాగులలో సబ్బుల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గతంలో ప్రకటన చేశారు. కాని ఏళ్లు కావొస్తున్నా దీని ఊసే ఎత్తడం లేదు. పరిశ్రమలు ఏర్పాటు చేసేంత వరకు ఏదో విధంగా జీసీసీ ఉత్పత్తులను మన్ననూర్ పరిధిలోని డీఆర్ డిపోలలో విక్రయాలు నిర్వహించాలి.

– కుమ్మరి పర్వతాలు, మన్ననూర్

గిట్టుబాటు లేక సరఫరా నిలిపేశాం



సంస్థ తరుపున చెంచులకు సేవచేయడం ఒకటి అయితే సంస్థ నిర్వహణలో వ్యాపార లావాదేవీలు కూడా ఒక భాగం. గతంలో జీసీసీ ఉత్పత్తుల సరఫరాలో కొంత పర్సంటేజ్ సంస్థకు ఆదాయం వచ్చేది. జీసీసీ ఉత్పత్తుల కేంద్రాలు మొత్తంగా ఏపీలో ఉండటంలో ఎమ్మార్పీ ధర కొనుగోలు చేసి తెలంగాణ డిపోలకు సరఫరా చేశారు. డీఆర్ డిపోల ద్వారా విక్రయించినా గిట్టుబాటు కాలేదు. ప్రస్తుతం మన రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాతో పాటూ మరికొన్ని జిల్లాల్లో సబ్బులు, షాంపులతో పాటూ తేనె ఫిల్టర్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఉత్పత్తులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– చంద్రబాను, జీసీసీ బ్రాంచ్ మేనేజర్ మన్ననూర్

జీఎస్టీపై కాంగ్రెస్‌ది ద్వంద వైఖరి

కొల్లాపూర్: జీఎస్టీపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి పాటిస్తోందని బీజేపీ జిల్లా నాయకుడు తమటం సాయికృష్ణగౌడ్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ జీఎస్టీపై మోడీ ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న గబ్బర్‌సింగ్ ట్యాక్స్ అని ప్రచారం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడేమో జీఎస్టీ తగ్గింపు ద్వారా రాష్ట్రాలకు వచ్చే ఆదాయం తగ్గిపోతుందని మాట్లాడటం ఇది కాంగ్రెస్ ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. మోడీ సర్కారు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్‌రావు, రాము తదితరులు ఉన్నారు.

ఎంపీహెచ్ఓగా సన్మానం

నాగర్‌కర్నూల్ రూరల్: బొప్పెల్లి పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ప్రమోషన్‌పై డిప్యూటీ డీహెచ్‌ఓ ఆఫీస్‌కు కమ్యూనిటీ హెల్త్‌గా నాగర్‌కర్నూల్‌కు బదిలీపై వచ్చారు. ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్పీ సంఘాల నాయకులు హాజరయ్యారు. నాగరాజు, మద్దిలేటి, అంతటి కాశన్న, రాజు, నాగన్న, భాస్కర్, గంగాధర్, నిరంజన్, మల్లేష్, రాములు, కురుమూర్తి పాల్గొన్నారు.

దాత సహకారంతో వేదిక ఏర్పాటు

తాడూరు: మండలంలోని భలాన్‌పల్లి ఉన్నత పాఠశాల ఆవరణంలో గ్రామానికి చెందిన దాత జైపాల్ రెడ్డి చొరవ సహకారంతో పాఠశాల ఆవరణంలో వేదిక నిర్మాణ పనులను ఆదివారం పనులు ప్రారంభించారు. ఈ నెల ఆఖరు వరకు నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మండల అధ్యక్షుడిగా శివుడు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో పీఆర్టీయూ నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా బి.శివుడు, ప్రధాన కార్యదర్శిగా కద్దాల పరమేష్‌ను ఎంపిక చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బిచ్యానాయక్; శ్రీనివాస్‌గౌడు, రాంచందర్‌రావులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి చేయూత

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన లస్కర్ శీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గ్రామానికి చెందిన గోలి సురేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డిలు చేయూత అందించారు. ఆదివారం రూ.23 వేల విలువగల కుట్టు మిషన్ ఆమెకు అందించారు. ఇద్దరు పిల్లలను చదివించేందుకు కృషి చేస్తామన్నారు. కాయితి శ్రీనివాస్ రెడ్డి, జాంగిర్, బాల్ జంగయ్య, బాలకిష్టి, బాలీశ్వర్ గౌడ్, లక్ష్మయ్య, శ్రీను, బాలస్వామి, లాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



పురస్కారం అందుకుంటున్న నాగేశ్వర్‌రావు

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హిందీ ఉపాధ్యాయుడు కమలేకర్ నాగేశ్వర్‌రావుకు ఆదివారం మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన అఖిల భారతీయ సాహిత్యకార్ సమ్మేళనంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆదిత్య సంస్కృతి మాసపత్రిక ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లోని దతియాలో హిందీ మహోత్సవాన్ని నిర్వహించారు. 19 రాష్ట్రాలకు సాహితీకారులతో జరిగిన కవి సమ్మేళనంలో కమలేకర్ నాగేశ్వర్‌రావు పాల్గొని కవిత వినిపించారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ మాజీ హోంశాఖ మంత్రి నరోత్తం మిశ్రా, ఆదిత్య సంస్కృతి పత్రికా సంపాదకులు జగత్‌శర్మ, మధ్యప్రదేశ్ సాహిత్య అకాడమీ డైరెక్టర్ శ్రీ వికాస్‌దవేలు డాక్టర్ సీతాకిశోర్ ఖరే స్మారక సాహిత్య సాధక్ పురస్కారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు



పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో లీకేజీ అవుతున్న పైపులైన్

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు కల్వకోలులో జాతీయ రహదారి పనుల్లో భాగంగా మిషన్ భగీరథ పైపులైన్ కొత్తగా ఏర్పాటు చేశారు. కాని పైపులైన్ పగిలీ నీరు లీకేజీ అవుతోంది. దీంతో తాగునీటి సరఫరాకు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో 20 రోజుల నుంచి రోడ్డు పనులు కొనసాగుతుండటంతో కొత్త పైపులైన్లు సెట్ కాకపోవడంతో నీటి సరఫరా నిలిచి పోయింది. గతంలో ఉన్న తాగునీటి బోర్లలో గ్రామ పంచాయతీ వారు మరమ్మతు చేసి తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టడంతో అధికారులు తాత్కాలికంగా నీటిని సరఫరా చేస్తున్నారు. కల్వకోలు వద్ద మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు చేసిన రెండు రోజుల వరకు సిమెంట్ కాంక్రీట్ ఆరిన తర్వాతనే నీటిని సరఫరా చేసేందుకు అధికారులు నిర్ణయించుకున్నారు. మండలంలో 10 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొన్నది. మిషన్ భగీరథ పైపులైన్‌ను త్వరగా మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు.

బీజేపీ కుట్రలను తిప్పికొడదాం



మాట్లాడుతున్న సాగర్

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరణకు బీజేపీ కుట్ర చేస్తోందని దీనిని అందరు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం తెలంగాణ విలీనం, వాస్తవాలు, వక్రీకరణలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. తెలంగాన రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని కొనియాడారు. భవిష్యత్‌లో బీజేపీకి బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్ధన్‌పర్వతాలు, ఆర్.శ్రీనివాసులు, దేశ్యానాయక్, ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు నర్సింహ, పొదిల రామయ్య, శంకర్‌నాయక్, తారాసింగ్, నాగరాజు, మధు, కురుమయ్య, మల్లికార్జున్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలు కాపాడటం అందరి బాధ్యత



అచ్చంపేట రూరల్: శాంతి భద్రతలు కాపాడడం అందరి బాధ్యత అని అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గణేష్ నిమజ్జనం, మిలాద్–ఉన్–నబీ వేడుకలను నిర్వాహకులు శాంతియుతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇరు వర్గాల నిర్వాహకులు అందరికీ ఆదర్శంగా నిలిచారని భవిష్యత్‌లోనూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని వివరించారు.

మురుగును తొలగించాలి

తెలకపల్లి: మండల కేంద్రంలో రోడ్డు వెంట నిల్వ ఉన్న మురుగును వెంటనే తొలగించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. నెహ్రూ చౌరస్తా నుంచి మండల కాంప్లెక్స్ కార్యాలయంతోపాటు సీఎల్ఆర్ కళాశాల వరకు ప్రధాన రోడ్డు వెంట గుంతలు ఏర్పడి నీరు మడుగులుగా మారి చెరువులను తలపిస్తున్నాయని ఆరోపించారు. సంబంధించిన అధికారులు పట్టించుకొని గుంతలలో నిల్వ ఉన్న మురుగును తొలగించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



‘ఆరు గ్యారంటీలు నమ్మి మోసపో‘యారు’



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

లింగాల: ఆరు గ్యారంటీలు నమ్మి ప్రజలు మోసపోయారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి సమ్మేళనంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు, మహిళలు అన్ని రకాలుగా మోసపోయారని విమర్శించారు. ఎన్నికల సమయంలో అమలు కాని హామీలతో ముఖ్యమంత్రి ప్రజలను దగా చేసి గద్దె నెక్కాడని, ప్రస్తుతం హామీలను అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. రైతులు యూరియా గురించి పడరాని పాట్లు పడుతున్న సీఎంలో చలనం లేదని, తన తప్పును కేంద్రంపై నెడుతున్నారని విమర్శించారు. అనంతరం మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిలో అభద్రతా భావం ఏర్పడిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదన్నారు. అంతకు ముందు ఏకలవ్య చౌరస్తా నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాకం తిర్పతయ్య, కేటీ తిర్పతయ్య, పోకల మనోహర్, మాజీ ఎంపీపీ జగపతిరావు, వెంకట్‌రెడ్డి, తుల్సీరాం, కోనేటి తిర్పతయ్య, రానోజీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆరోగ్యానికి ఐజేయూ ప్రాధాన్యం



అచ్చంపేట రూరల్: జర్నలిస్టుల ఆరోగ్యానికి టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ప్రాధాన్యం ఇస్తోందని ఆ యూనియన్ అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు రేసోజు సాయిబాబు, కార్యదర్శి కొండపల్లి వెంకటయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 10న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆస్పత్రి సౌజన్యంతో, యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులు బాలరాజు, శ్రీధర్, లక్ష్మీపతి, రమేష్, ప్రభాకర్, రవి, రవీందర్, ఆంజనేయులు, నారాయణరావు, సహజానందం, సాధిక్, జంగయ్య, రామలింగయ్య పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎస్‌ఏవీ గుప్తా ఉన్నత పాఠశాలలో 1995–96 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని కుటుంబ, ఉద్యోగ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువులను శాలువా కప్పి మెమెంటోతో సన్మానించారు. ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, గణేష్, వెంకటేశ్వర శర్మ, శ్రీనివాస్ రెడ్డి, సీతాజానకి, ఇశ్రాత్ బేగం, రఘువీర్, పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు రాఘవేందర్, కోట కిషోర్, రమాదేవి, ఖాలీద్ పాషా, శ్రీనివాసులు, సుధారాణి, సునీత, కృష్ణ పాల్గొన్నారు.

నేడు అవగాహన ర్యాలీ

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఫిజియోథెరపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా.సుమంత్ ఆ దివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవగాహన ర్యాలీ ఉదయం 9:00 గంటలకు పాత కలెక్టర్ భవనం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైస మ్మ జాతరకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై మైసమ్మ దేవతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం పౌర్ణమితో పాటు చంద్రగ్రహణం కారణంగా జాతరకు భక్తులు 5 వేల మంది భక్తులు హాజరైనట్లు ఎండోమెంట్ అధికారు లు తెలిపారు. భక్తులు లేకపోవడంతో ఆర్టీసీ బస్సు లు, జాతరలో ఏర్పాటు చేసిన తినుబండరాగాల గుడారాలు, ఇతర గుడారాలు గిరాకి లేక వెలవెలబోయాయి. వినాయక చవితి సందర్భంగా గత రెండు వారాలుగా తక్కువ సంఖ్యలో వచ్చారని పేర్కొన్నారు.

రావి నారాయణరెడ్డికి నివాళి



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ, జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండీ ఫయాజ్‌లు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహ, పెబ్బేటి విజయుడు, మారెడ్ శివ, శంకర్, కృష్ణాజి బుల్లెద్దుల శ్రీనివాస్, కార్యదర్శి బి శ్రీనివాస్, శివుడు, వెంకటయ్య, శంకర్‌గౌడ్, రవిందర్, లక్ష్మీపతి, కిరణ్, గోపాల్, నరేష్, మధు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: వ్యక్తికి తీవ్ర గాయాలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామ సమీపంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం నార్లాపూర్ గ్రామం నుంచి కుడికిల్లకు బైక్‌పై చంద్రుడు వస్తున్నాడు. కల్వకోల్ గ్రామం నుంచి మొలచింతపల్లి గ్రామానికి చెందిన బాలస్వామి గౌడ్ కుడికిల్ల మీదుగా బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో గ్రామ సమీపంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలస్వామిగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కొల్లాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

ఆటో, బైక్ ఢీ: నలుగురికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తెలకపల్లి నుంచి వస్తున్న ఆటోను జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న అలంపూర్ ఎక్స్ రోడ్‌కు చెందిన వెంకటేష్, కేశంపేటకు చెందిన జయమ్మకు, ద్విచక్రవాహనంపై ఉన్న తాడూరుకు చెందిన గణేష్, గగ్గలపల్లికి చెందిన మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

తెగుళ్లబారిన పత్తి పంట



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంట ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంట తెగుళ్లబారిన పడుతోందని రైతుల వాపోయా రు. గూడ రాలడంతో ఎర్రబారి దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా కాయరాదని వచ్చిన గూడ కూడా వర్షాల కారణంగా పనికి రాకుండా పోతుందని నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకొని పంట నష్టం చెల్లించాలంటూ ఆయా గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇరుకుగా దారి.. వాహనదారుల ఇబ్బందులు



రోడ్డుకు ఇరువైపులా అల్లుకున్న చెట్లపొదలు

తాడూరు: మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి ఇంద్రకల్, ఐతోల్ మీదుగా జడ్చర్ల మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు తాడూరు సమీపాన రోడ్డుకు ఇరువైపులా చెట్లు అల్లుకుపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే మలుపులు ఉండడం రోడ్డుకు ఇరువైపులా చెట్లు అల్లుకుపోవడం ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడం లేదు. మలుపుల దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.



నక్కలపల్లికి వెళ్లే దారిలో..

రాకపోకలకు అంతరాయం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రం నుంచి నక్కలపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరగడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండు సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పిచ్చిమొక్కల తొలగింపును అధికారుల పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా చెట్ల కొమ్మలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.